International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-2, April-June, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# వృద్ధుల జీవన పరివేదనను చిత్రించిన "మా అమ్మానాన్న కథలు"

డా. పొట్లూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి,
ఏలూరుజిల్లా – 534460
చరవాణి: 9390883982
మెయిల్: johnveslyp@gmail.com

**ఉపోద్ఘాతం:**

ప్రతీవ్యక్తీ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం అనే దశల్ని దాటకుండా అతని జీవితం పరిపూర్ణంగా ముగించలేదు. తప్పటడుగులతో బాల్యం తనకు తెలియకుండానే గడిచిపోతుంది. అన్నిటినీ చేయగలనుకునే యవ్వనదశ అందమైన అనుభవాలతోనూ, జ్ఞాపకాలతోనూ గడిచిపోతుంది. అత్యంత కీలకమైంది వృద్ధాప్యదశ. తన పని తాను చేసుకోలేక, ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడుతూ, వాళ్ళ ఛీదరింపుల్ని, అవమానాల్ని తట్టుకుంటూ, అల్లరి బాల్యాన్నీ, అనుభవాల యవ్వనాన్నీ నెమరువేసుకుంటూ వృద్ధాప్యం సేదదీరుతుంటుంది. అనుభవాలతో పండిపోయిన వృద్ధుల ఆలోచనలు కుటుంబ వృద్ధికైనా, సమాజ మనుగడకైనా ఎంతో అవసరం. కానీ వారికి సేవచేసే ఓపికలేని నేటి తరాలు వారిని వృద్ధాశ్రమాల్లో వదిలిపెట్టేస్తున్నారు. డబ్బులివ్వగలిగే స్థితిలో ఉన్నప్పటికీ వారికోసం సమయం కేటాయించి, వారి బాగోగుల్ని పట్టించుకునే స్థితిలో నేటి సమాజం లేదు. అందువల్ల వారి జీవితం అత్యంత దయనీయంగా మారిపోయింది. చావెప్పుడు వస్తుందో తెలియక, ఎందుకు బ్రతికున్నామో అర్థంకాక అవమానకరమైన పరిస్థితుల్లో బ్రతుకీడ్చుతున్నారు. అయినవారి మధ్య శేషాజీవితాన్ని ఆనందంగా బ్రతుకీడ్చాల్సిన వృద్ధాప్యం శాపంగా పరిణమిస్తోంది.

**మా అమ్మానాన్న కథాసంపుటి పరిచయం:**

వృద్ధుల సమస్య నేడు ఒక బలీయమైన సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంది. ఏ వర్గంవారైనా, ఏ ప్రాంతం వారైనా వృద్ధుల సమస్యలు అందరివీ దాదాపు ఒకే విధంగా వుండడం ఆలోచించదగ్గ విషయం. మా అమ్మానాన్న కథలు అనే పేరుతో వచ్చిన కథాసంకలనాన్ని తెలుగుకథా రచయిత వేదిక కన్వీనర్ శ్రీ సి.హెచ్. శివరామప్రసాద్ (వాణిశ్రీ) వెలువరించారు. వీరు గతంలో "సీనియర్ సిటిజన్ కథలు" పేరుతో తొలిసారి వృద్ధుల సమస్యలను కథలరూపంలో తీసుకువచ్చారు. తర్వాత "మా సీనియర్ సిటిజన్స్" అనే పేరుతో నలభైమంది తెలుగు రచయితల కథలతో ప్రపంచ వృద్ధుల దినోత్సవమైన అక్టోబర్ 1, 2013 వ తారీఖున ఒక సంకలనం ప్రచురించారు. ప్రస్తుతం 37 మంది లబ్ధ ప్రతిష్టు లైన రచయితలతో "మా అమ్మానాన్న కథలు" పేరుతో కథా సంకలనం వెలువరించారు. ఈ సంకలనం ద్వారా వృద్ధుల సమస్యలను వెలుగులోకి తెచ్చి పాఠకులకు అవగాహన కల్పించడమే వారి ఆశయంగా పెట్టుకున్నారు. వృద్ధుల సమస్య లను వివిధ కోణాలనుంచి రాసిన 37 కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. అన్ని కథలూ కాదుగానీ కొన్ని కథల్లో వృద్ధుల జీవన విధానం పరిణమించిన తీరును వివరించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

**"అమ్మ డబ్బు ఉప్పు"** అనే కథలో రచయిత వృద్ధులకు ఇచ్చిన ప్రాధాన్యత కనిపిస్తుంది. సరస్వతి అనే వృద్ధురాలి పాత్ర ద్వారా నేటి తరానికి వృద్ధుల అవసరం ఎంత అవసరమో గుర్తించమంటారు. కూరలోకి సరిపోయినంత ఉప్పు వేసుకుంటాం గానీ దానికి మించి ఉప్పును ఉపయోగించం. దానివల్ల రుచి పెరగకపోగా ఆ కూర తినడానికి పనికి రాకుండా పోతుంది. డబ్బు విషయంలో కూడా మన స్తోమత గమనించి ఖర్చుపెట్టాలే తప్ప అవసరానికి మించి ఖర్చు పెడితే అప్పులు పెరుగుతాయనే బోధ వృద్ధురాలైన సరస్వతి తన కుటుంబసభ్యులకు చెప్పినా ఎవరూ పట్టించుకోరు. కూతురు కొడుకైన వంశీకృష్ణకి ఫీజుకట్టే నిమిత్తం పద్దెనిమిది వేలిచ్చిన సరస్వతి కొడుకు కూతురైన స్రవంతి స్నేహితు లతో కలిసి టూరుకి వెళ్తానంటే మాత్రం డబ్బివ్వడానికి నిరాకరిస్తుంది. అవసరాలను గుర్తించి డబ్బు ఖర్చుపెట్టుకోవాలనే ఆలోచన ఈ తరానికి కూడా చెప్పాలనే తపన ఉన్న పాత్రగా 'సరస్వతి' కనిపిస్తుంది.

**"అందరూ ఉన్నా..."** అనే కథ మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. పిల్లలచేత నిరాకరించబడిన తల్లిదండ్రు లంతా వృద్ధాశ్రమాల్లో సేదదీరుతుంటారు. ఇద్దరు స్నేహితులకు చెందిన కథను ఇందులో వివరిస్తారు రచయిత. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పసిపిల్లల లాంటివారని, పిల్లల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో తల్లిదండ్రుల్ని కూడా అంతే జాగ్రత్తగా చూసుకోవాలనే ఆలోచనకు పాదువేస్తారు రచయిత. పిల్లలు తప్పులు చేయడం సహజం. అయినా వాటిని తెలుసుకుని తల్లిదండ్రుల పట్ల తమ బాధ్యతను నెరవేర్చడం అవసరం అని చెప్తుందీ కథ. **"అమ్మా అని పిలిచినా"** కథలో వృద్ధాప్యంలో సేవచేసే భార్యని అమ్మా అని పిలవడంలో తప్పులేదనే భావాన్ని వ్యక్తపరుస్తాడు రచయిత. జీవితపు మలిసంజెలో కాలూచేయీ కూడదీసుకోలేని సమయంలో, బ్రతుకు చరమదశలో కాలకృత్యాలకు సైతం తన వంతు సహకారం అందించి అన్నివేళలా ఆదుకునే భార్యను అమ్మా అని పిలవడం ఆశ్చర్యం ఏముంది అనే విషయాన్ని ఈ కథలో వ్యక్తపరుస్తారు రచయిత.

**"అంతర్మథనం"** కథ నేటి వృద్ధుల పరిస్థితులకు అద్దంపట్టిన కథ. వృద్ధాశ్రమంలో ఉన్న తండ్రి తనపై నిర్లక్ష్యం చూపిన కొడుకుని ఉద్దేశిస్తూ రాసిన ఉత్తరమే అయినా తల్లిదండ్రుల పట్ల కొంతమంది కుమారులు ఎంత నిర్దయగా ఉంటారో తెలియజేసిన కథ ఇది. 'కనిపెంచిన నాడు కొడుకు కానీ కోడలు వచ్చాక కొడుకు కాదు' అన్న సామెత తన కొడుకు జీవితంలో ఎలా నెరవేరుతుందో చెప్తూనే వృద్ధాప్యంలో నిరాదరణను మించిన భయంకరమైన వ్యాధి మరొకటి లేదనే వాస్తవాన్ని కూడా ఈ కథ చెప్తుంది. మొక్కుబడిగా తల్లి మాసికాలు పెట్టిన కొడుకు బీపీ షుగర్ వున్న తండ్రిని ఎంతగా నిరాదరించాడో ఈ కథలో చెప్తాడు రచయిత. వృద్ధాప్యంలో ఓపికలేకపోయినా తన పని తాను చేసుకుంటున్న తండ్రికి ప్రతీ పనిలోనూ వంకపెట్టడమే కాకుండా ఛీదరించుకున్న కొడుకు కోడలు మనస్తత్వాన్ని చెప్తూనే, కనీసం మనవడికైనా మంచి ప్రవర్తన నేర్పించమని ఉద్బోధిస్తాడు. లేకపోతే ఈరోజు తనకి పట్టిన ఈ గతి రేపు నీ కొడుకు ద్వారా నీకు కూడా పడుతుందనే విషయాన్ని తెలియజేయడం బాధాకరం.

**"బామ్మగారి బస్సుప్రయాణం"** అనే కథ వినోదాన్ని పండిస్తూనే విషాదాన్ని వ్యక్తపర్చిన కథ. ముసలితనం శరీరానికే కానీ మనసుకు కాదని తెల్పిన ఒక బామ్మకథ ఇది. వృద్ధాప్యంలో కొడుకులు కూతుళ్ల చేత నిరాకరింపబడిన బామ్మ వృద్ధాశ్రమంలో చేరి, తన పరిస్థితికి కుంగిపోకుండా ఎవరినీ నిందించకుండా తన జీవితాన్ని గడపడం ఈ కథలో కనిపిస్తుంది. తనకు తెలిసిన అప్పడాలు, వడియాలు పెట్టడం అనే పనిని ఎంతో చాకచక్యంగా చేసుకుంటూ వాటిని షాపులలో అమ్మి వచ్చిన డబ్బుల్ని కూడా మిగతా వృద్ధులకు కేటాయించడం అనేది ఈ కథలో కనిపించే

ముఖ్యాంశం. మనసును ఆనందంగా ఉంచుకుంటే ఎటువంటి పరిస్థితిలో అయినా సంతోషంగా ఉంటామనే విషయాన్ని తెల్పుతుందీ కథ. అప్పడాలు వడియాలు అమ్మడానికి బస్సులో ప్రయాణించిన బామ్మ మిగతా ప్రయాణికుల్ని ఉద్దేశించి చెప్పిన మాటలు అందరూ ఆలోచించదగ్గవి. అధిక సంతానం గురించి, యువకులలో రావలసిన పరివర్తననీ గురించి వ్యంగ్యంగా హెచ్చరించడం ఈ కథలో కొసమెరుపు.

వృద్ధుల సమస్యలను వ్యక్తపర్చిన మరో కథ **"ఆశాభావం"**. 'పదేపదే ముసలాళ్లమని అనుకోవడంతోనే ఈ చిక్కులు. మనకీ ఇంకా ఏదైనా చేసే శక్తి ఉంది. అంతకన్నా మనమీద మనకి విశ్వాసం ఉంది. .. అంటూ వృద్ధులు కూడా వాళ్లమీద వాళ్ళకి నమ్మకం కలిగించుకోవాలనే అవగాహనను ఈ కథలో వ్యక్తపర్చారు రచయిత్రి. రిటైరయ్యాక కొడుకు మాటలు నమ్మి వచ్చిన డబ్బులన్నీ కొడుకు కడుతున్న ఇంటికి ఇచ్చేస్తారు శాస్త్రి, కామాక్షి దంపతులు. కానీ రోజులు గడిచేకొద్దీ కొడుకు కోడలులో వస్తున్న మార్పుల్ని గమనిస్తున్న చేసేదేమీలేక ఊరుకుంటారు. మనవడికనీ, మనవరాలికనీ, తమ ప్రైవసీ కోసమనీ కొడుకు కోడలు కనీసం వీళ్ళిద్దరూ ఉండడానికి గదికూడా లేకుండా చేస్తారు. ఆత్మాభిమానంతో ఇల్లువదిలిపెడతాడు శాస్త్రి. మూర్తి అనే వ్యక్తి సాయంతో వాళ్ళకు తెలిసిన వంటలు చేయడం ద్వారా కష్టపడి మరో కొంతమంది వృద్ధులకి చేయూతనివ్వడం ఈ కథలో కనిపిస్తుంది. తల్లిదండ్రులెప్పుడూ పిల్లల అభివృద్ధికి అడ్డురాకూడదు. మనం మన సంతానమనీ, మనవళ్ళనీ పాకులాడితే వాళ్ళు కూడా వాళ్ళ సంతానం కోసమే స్వార్థచింతన ఎక్కువ చేసుకుంటున్నారు అంటూ చెప్తారు రచయిత్రి.

వృద్ధాప్యంలో తోడు ఎంత అవసరమో చెప్తుంది **"ఊతకర్ర"** అనే కథ. భార్యపోయిన తర్వాత పిల్లల ప్రవర్తనలో వచ్చిన తేడా గమనించిన ఆనందరావు నలభై ఐదు సంవత్సరాల వయసున్న ఒక కాలేజీ లెక్చరరుని పెళ్ళిచేసు కుంటాడు. దానినొక నేరంగా భావించిన కుటుంబసభ్యులతో పాటు తెలిసిన వారందరూ ఆనందరావు చేసిన పనిని నిందిస్తుంటారు. కానీ వయసులో ఒక తోడుకోసం, వృద్ధాప్యంలో ఊతకర్రగా ఉపయోగపడతుందనే వుద్దేశ్యంతోనే ఆమెను పెళ్లిచేసుకున్నాను తప్ప వేరే వుద్దేశ్యంతో కాదు అని తన స్నేహితుడితో చెప్తాడు ఆనందరావు. జీవితపు మలిసంజెలో తోడు ఎంత అవసరమో ఈ కథలో చెప్తారు రచయిత్రి.

అమెరికాకు పిల్లల్ని పంపించాలనే ఆలోచన ప్రతీ తల్లీదండ్రికి ఉంటుంది. దానికోసం ఎంతో శ్రమపడతారు. తీరా వాళ్ళు అమెరికాకు వెళ్ళాక తమను చూడడానికి రాలేదని నిరంతరం తపన పడుతుంటారు. అటువంటి తల్లి దండ్రుల మానసిక క్షోభను వివరించే కథ **"రెండు ఒకటైన వేళ"**. 'డబ్బు... డబ్బు... సంపాదన, విదేశాలు... ఈ కోరికల్ని వాళ్లలోకి ఎక్కించి మన ఒంటరితనాన్ని మనమే కొనితెచ్చుకున్నామేమో...' అనే సంభాషణ ఈ కథలోని విషయాన్ని చెప్పకనే చెప్తుంది. జీవితంలో ఎంత డబ్బున్నా, ఎన్ని కార్లున్నా అయినవాళ్ళు దగ్గరలేని వెలితి ఏదో ఒక రూపంలో వెంటాడుతూనే ఉంటుంది. పిల్లలు చూడడానికి రావట్లేదని బాధపడుతున్న భర్త మనోవేదన కొంచెమైనా తగ్గించాలనే ఉద్దేశ్యంతో యాదగిరిగుట్ట ప్రయాణం పెడుతుంది సీతమ్మ. దారిలో ప్రతీక్షణం పిల్లల గురించి కలవరించి, వాళ్ళకోసం తపనపడి స్వామి దర్శనం కాకుండానే గుండెపోటుతో మరణిస్తాడు రామారావు. శవాన్ని భద్రపరిచే ఎమ్బాల్మింగ్ కూడా దొరకదు. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉంటారు. అయితే అమెరికాలో ఉన్న పెద్దకొడుకు బ్లాక్స్ చేసిన దాడిలో మరణించడం, చిన్నకొడుక్కి ఉద్యోగం పోయి అందరికీ దూరంగా బ్రతకడం అనే విషయాలు తెలియకుండానే రామారావు మరణించడం, ఏం చేయాలో తెలియక సీతమ్మ పిచ్చిదానిలా ఆలోచించడం మనసును

కదిలిస్తాయి. వృద్ధాప్యానికి తోడు ఇలాంటి విషయాలు కూడా జతచేరితే జీవితం ఎంత దయనీయంగా ఉంటుందో ఈ కథలో చూపిస్తారు రచయిత.

**"ఒడలు-బళ్ళు"** అనే కథ ఒక కొత్త కోణాన్ని మనముందు ఆవిష్కరిస్తుంది. కోడలి చేతిలో బానిసల్లా బ్రతికిన అత్తామామలు, అనుకోకుండా జరిగిన ప్రమాదంలో కొడుకు మరణించిన తర్వాత కోడల్ని తమ కూతురులా చూసుకోవడం, తను చేసిన పనులకు సిగ్గుపడి కోడలు పశ్చాత్తాపం పొందడం అనే అంశాల్ని ఈ కథలో చక్కగా వివరించారు రచయిత. **"చేతులు కాలాక..."** అనే కథ కూడా వృద్ధాశ్రమంలో ఉన్న తల్లిదండ్రుల గురించి చెప్పే కథ. అందరికీ పెద్దదిక్కుగా ఉన్న సదాశివం కోడలి మాటలతో చాలా బాధపడతారు. కొడుకు ఏమీ మాట్లాడకుండా ఉంటాడు. చివరికి కోడలి పోరు భరించలేక తల్లిదండ్రుల్ని చూస్తూ ఉండలేక ఇద్దర్నీ తీసుకెళ్లి ఒక అనాధాశ్రమంలో చేర్చుతాడు. సదాశివం దంపతులు ఇద్దరూ అక్కడున్న వారి అందరి ఆదరాభిమానాలు పొందుతారు. అయినా కొడుకు దగ్గరలేడనే బాధతో సదాశివం చనిపోతాడు. కొడుకుని పిలిపించి ఆశ్రమంలోనే అంత్యక్రియలు చేయిస్తారు. అవి అయిన తర్వాత అక్కడున్నవారంతా తండ్రి గొప్పదనాన్ని చెప్తుంటే కొడుకైన నాగేంద్ర చాలా సిగ్గుపడతాడు. తల్లిని అక్కడుంచలేక ఇంటికి తీసుకెళ్తాడు. వెళ్ళిన దగ్గర్నుంచీ మళ్ళీ కోడలి చేతిలో ప్రత్యక్ష నరకాన్ని చూసిన తల్లి కూడా తండ్రి పోయిన మూడు నెలలకు చనిపోతుంది. ఏం చేయాలో తెలియక తన అశక్తతకు తనలో తానే బాధపడుతుండడం ఈ కథలో వివరిస్తారు రచయిత్రి.

వృద్ధాప్యంలో ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని పరిస్థితులు ఎలా ఉంటాయో, అలా ఉండాల్సిన తరుణం వస్తుందేమో అనుకున్నప్పుడు వాళ్లెంత పని చేస్తారో చెప్పే కథ **"జీవితంలో కొంత"**. పిల్లలకు ఇంగ్లీష్ రాకపోవడానికి కారణం తల్లిదండ్రులని భావించిన అవినాష్ వాళ్ళను తమ దగ్గర్నుంచి పంపించి వేరేచోట ఉంచుదామనుకుంటాడు. ప్రయాణంలో ఉన్న అవినాష్‌కి ఆంజనేయులు అనే ముసలాయన పరిచయమవుతాడు. చివరికి తెల్లారిన తర్వాత తన బ్యాగ్ కనిపించకపోవడంతో కంగారు పడిన అవినాష్ పోలీస్ కంప్లైంట్ ఇస్తాడు. తర్వాత అతని బ్యాగు దొరికిందని చెప్పి బ్యాగుతో పాటు ఆంజనేయులిచ్చిన ఉత్తరం కూడా అవినాష్‌కి ఇస్తారు. ఆంజనేయులు తన భార్య వైద్యంకోసమే విధిలేని పరిస్థితుల్లో బ్యాగు దొంగిలించాననీ, తన భార్య చనిపోతే తను కూడా బతకలేననీ, వైద్యంకోసం ఎనిమిది వేలు ఖర్చుపెట్టుకున్నాననీ రాస్తాడు. ఆ ఉత్తరం చదివిన అవినాష్‌లో పశ్చాత్తాప కలుగుతుంది. వృద్ధాప్యంలో ఒకరి తోడు ఒకరు కోరుకునే తల్లిదండ్రుల్ని దూరంగా ఉంచాలన్న ఆలోచన తనకు కలిగినందుకు సిగ్గుపడతాడు.

**"తదనంతరం"** అనే కథ తండ్రీ కొడుకుల స్వగతంలా సాగే కథ. ఆస్తికోసం ఈ తరాలెంత ఆరాటపడు తుంటాయో చెప్పే కథ. కొడుకు ఎప్పుడు ఆస్తిని పంచమని అడిగినా నా తదనంతరం ఇస్తానంటూ దాటవేస్తుంటాడు విరాటమూర్తి. చివరికి విరాటమూర్తికీ కొడుకు నానాజీకి ఆస్తి విషయంలో గొడవ జరుగుతుంది. వ్యాపారాలు చేసి ఆస్తిని తగలబెట్టిన కొడుక్కి మళ్ళీ ఇల్లుకూడా అమ్మి డబ్బిస్తే తమకు ఉన్న ఒక్క ఆధారమూ పోతుందని బాధపడతాడు విరాటమూర్తి. కానీ కొడుకైన నానాజీ కూడా తనలో తను మథనపడుతుంటాడు. తను ఆస్తి హారతికర్పూరంలా తగలబెట్టబట్టే తన తండ్రి తనకు ఆస్తినివ్వట్లేదని గ్రహిస్తాడు. అయినా ఒక్కసారి ఇస్తే తనను తాను నిరూపించు కోవాలనుకుని ఒక రాత్రి భోజనాల దగ్గర తండ్రితో గొడవ పెట్టుకుంటాడు. రోజు రాత్రి భోజనం చేసిన తర్వాత

నడవ దానికి వెళ్తాడు విరాటమూర్తి. బ్యాంకు పాస్'బుక్ కోసం తండ్రి గదిలోకి వెళ్ళి అన్నీ వెదుకుతున్న క్రమంలో దిండుకింద కనిపించిన గుండెజబ్బు మాత్రలు నానాజీలో పరివర్తన కలిగిస్తాయి. గుండెజబ్బును కూడా దాచిపెట్టి తన కుటుంబాన్ని సాకుతున్న తండ్రిని అపార్థం చేసుకున్నానని తనలో తానే కుమిలిపోతాడు. చివరికి తండ్రికి గుండెనొప్పి రావడం, సకాలానికి ఆస్పత్రికి తీసుకెళ్తూ "నీ సంస్కారం, ఆత్మీయత, ప్రయోజకత్వం మాకు సంక్రమిస్తే చాలు. తదనంతరం ఆస్తికోసం ఆశించను గాక ఆశించను" అని మౌనంగా రోదిస్తాడు నానాజీ.

**"నాన్న నవ్విన వైనం"** కథ ఒక కొత్త ఆలోచనని పాఠకుల ముందుంచుతుంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని చూడాల్సిన బాధ్యత పిల్లలది. కానీ అనేక కారణాలతో తల్లిదండ్రుల్ని ఏదో ఒక ఆశ్రమంలో చేర్పించి చేతులు దులుపు కుంటున్నారు నేటి పిల్లలు. కథలోని గోపాలరావు తన కొడుకులతో ఎప్పుడూ తల్లిదండ్రులను ఆశ్రమాల్లో చేర్పించిన కొడుకుల గురించి చెప్తుంటాడు. ఆ మాటలు విన్న కొడుకులిద్దరూ ముసలివాళ్ళైన తల్లిదండ్రులిద్దరూ తమనుంచి ఏదో ఆశిస్తున్నారని భావించి వాళ్ళిద్దరిని ఎవరు తీసుకెళ్లాలో అనే విషయం గురించి గోపాలరావుకి తెలియకుండా మాట్లాడు కుంటూ ఉంటారు. చివరికి ఏం జరుగుతుందో అర్థంకాక అయోమయంలో ఉన్న కొడుకులిద్దరికీ యశోదమ్మ తన భర్త చేయబోయే పని గురించి చెప్తుంది. తనకున్న ఇల్లు అమ్మేసి వృద్ధాశ్రమం పెట్టాలనుకుంటున్నారనీ, అందుకోసం ఏఏ వూరిలో ముసలివాళ్లున్నారో వాళ్ళ గురించి మీ నాన్న ఎంక్వైరీ చేస్తున్నారనీ చెప్తుంది. ఆ మాటలు విన్న పిల్లలిద్దరూ ఆలోచనలో పడతారు. వృద్ధాప్యంలో కొడుకుల మీద ఆధారపడకుండా, తమలాగే వున్న కొంతమంది వృద్ధుల్ని చేరదీసి వాళ్ళకు కూడా ఆశ్రయం కల్పించాలనే ఆలోచనతో వున్న తండ్రిపట్ల తమ బాధ్యత మర్చిపోయి ఏవో కుటిల ఆలోచనలు చేసినందుకు బాధపడతారు.

దూరంగా ఉన్న పిల్లల్ని తల్చుకుని తల్లిదండ్రులెంత తల్లడిల్లుతారో చెప్పే కథ **"పిడికెడు గుండె".** డాక్టరైన కొడుకు అమెరికాలో స్థిరపడి తల్లి చనిపోయినప్పుడు కూడా ఇండియాకి రాడు. కొత్తగా ప్రాక్టీసు పెట్టిన డాక్టరులో తన కొడుకుని చూసుకోవాలని ప్రతీరోజు అతని దగ్గరికి వస్తుంటాడు ప్రసాదరావు అనే 62 సంవత్సరాల ఒక ముసలాయన. వారంలో రెండుసార్లు ఏదో ఒక రోగం వచ్చినట్లుగా రావడం, కాసేపు డాక్టరుతో మాట్లాడిపోవడం, ఆయన రాసిచ్చిన మందులచీటీ చించడం డాక్టరుకి తెలుస్తుంది. ప్రసాదరావు చేసిన పనికి ముందు కోపం వచ్చినా తర్వాత అతని ప్రవర్తనకి కారణం ఏంటో కనుక్కోవాలనే కుతూహలం కలుగుతుంది డాక్టరుకి. చివరికి ఎన్నిసార్లు వచ్చినా గుండెనొప్పి గురించి చెప్తుంటాడు ప్రసాదరావు. డాక్టరు తన కొడుకులాగే ఉండడం, ఏదో ఒక వంక పెట్టుకుని అతన్ని చూడడానికి వస్తున్నట్లుగా చెప్తాడు ప్రసాదరావు. ఆయన మాటలు విన్న డాక్టరుకి మనసులో ఏదో బాధ కలుగుతుంది. భార్య చనిపోయి, కొడుకు దూరంగా ఉండి ప్రసాదరావు జీవితం ఒంటరితనంతో ఎంత ఆవేదన చెందుతుందో తెల్సుకుని బాధపడతాడు డాక్టరు.

వృద్ధాప్యంలో వచ్చే అల్జీమర్స్ గురించి చక్కగా వివరించిన కథ **"మా ఊరు ఒక్కసారి పోయి రావాలి".** తోట మాలిగా ఉన్న తండ్రి, పద్యాల్ని పాటల్ని నేర్పిన తల్లిని వదిలి ఎక్కడో విదేశాలలో ఎం.డి చేసి సైకియాట్రిస్ట్'గా స్థిరపడిన ఆదిత్య పుట్టిపెరిగిన ఊరిలో సెమినారుకి వస్తాడు. అతను మతిమరుపు గురించి, వృద్ధులలో వచ్చే సమస్యల గురించి ఉపన్యసిస్తున్న సందర్భంలో హఠాత్తుగా ఒక వృద్ధురాలు ఆ ప్రాంతంలోకి వచ్చి వెంటనే వెళ్లిపోతుంది. ఆమెను చూసిన ఆదిత్య ఆమెను తన తల్లిగా గుర్తించి బాధపడతాడు. విదేశాలలో మైథిలి అనే అమ్మాయిని పాటను

ప్రేమించి, ఆమెను పెళ్లిచేసుకోవడానికి తానొక జమీందారు కొడుకునని అబద్ధం చెప్తాడు ఆదిత్య. చివరికి ఇన్నేళ్ల తర్వాత తన తల్లి అల్జీమర్స్'తో బాధపడుతూ కనీసం తనని కూడా గుర్తించలేని స్థితిలో ఉంటుంది. ఎన్నో విషయాలు తల్లికి గుర్తుచేస్తాడు కానీ ఆమె నవ్వి ఊరుకుంటుంది. విదేశాలు వెళ్లాలనే ఆలోచన మానుకుని తన తల్లి 'ఆశా పేరుమీద 'అఫెక్షన్ సెక్యూర్ హోమ్ ఫర్ అల్జీమర్స్ పేషెంట్' అనే ఆశ్రమాన్ని స్థాపిస్తాడు. కథాకథనం ఎంతో ఆర్ద్రంగా సాగుతుంది. ఉన్నఊరును కన్నతల్లిని మరిచిపోయి మనిషి ఎంతదూరం వెళ్ళినా ఆ జ్ఞాపకాలు మనసులో కదలాడుతూనే ఉంటాయని చెప్పిన గొప్ప కథ.

**ముగింపు:**

వృద్ధుల సమస్యలను వివిధ కోణాలలో వ్యక్తపరుస్తూనే అక్కడక్కడా వాటికి పరిష్కారాలు కూడా సూచించిన కథలు ఈ సంపుటంలో మనకు కనిపిస్తాయి. అన్ని కథలను పరిచయంచేయడం వీలుపడలేదు. కేవలం పైన చెప్పిన కథలే కాకుండా మిగిలిన కథలు కూడా వృద్ధుల సమస్యలను అర్థం చేసుకునే దిశలోనే సాగడం విశేషం. దాదాపుగా అన్ని కథలూ కుటుంబసంబంధాలు, పిల్లల మనస్తత్వాల్ని అర్థంచేసుకోలేక ఇబ్బందిపడే తల్లిదండ్రులు, తల్లిదండ్రుల్ని అర్థంచేసుకోలేని పిల్లలు, అన్ని పరిస్థితులకు ఆర్థిక సంబంధాలే పునాదిగా నిలవడం ఈ కథల్లో మనకు కనిపించే అంశాలు. రెండోపెళ్లి చేసుకున్నా దాన్ని ఇంకా ఆమోదించలేని సమాజ వాతావరణం కూడా ఆయా కథల్లో కనిపిస్తుంది. మొత్తం మీద వృద్ధాప్య జీవన పరివర్తనని అన్ని వైపులనుంచీ సమర్థంగా వ్యక్తీకరించిన సంకలనంగా "మా అమ్మానాన్న కథలు" అనే కథాసంకలనాన్నిమనం గుర్తించవచ్చు.

........................

**ఉపయుక్త గ్రంథాలు/వ్యాసాలు:**

1. మా అమ్మా నాన్న కథలు, శ్రీ సి.హెచ్. శివరామప్రసాద్ (వాణిశ్రీ), సంపాదకులు, అక్టోబర్ 1, 2013